ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
బుధవారం
24 సెప్టెంబర్ 2025

ఉప్పాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, సెప్టెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్): కాకినాడ జిల్లా ఉప్పాడలో మత్స్యకారుల ఆందోళనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలతో తమ జీవనోపాధిపై ప్రభావం పడుతున్నట్లు ఉప్పాడ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన, వారి సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు పవన్ ఓ ప్రకటన విడుదల చేశారు."ప్రస్తుత పరిస్థితుల మూలంగా మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోగలను.

ప్రస్తుతం శాసనసభ సమావేశాల కారణంగా వ్యక్తిగతంగా వచ్చి మత్స్యకారులతో నేరుగా చర్చించలేకపోతున్నాను. వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చిస్తున్నాను. ప్రతి సమస్యను పరిగణనలోకి తీసుకొని పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆదేశించాను. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీష్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్తో ఓ కమిటీని ఏర్పాటు చేస్తాం. దీనిలో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించాం. సమస్యల పరిష్కారంతోపాటు జీవనోపాధి మెరుగుదల, తీర ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా ఈ కమిటీ దృష్టిపెడుతుంది. నష్ట పరిహారం మదింపు గురించి చర్చిస్తుంది. మత్స్యకారుల సమస్యలను అధ్యయనం చేసి, అమలు చేయదగిన సిఫారసులతో కూడిన నివేదికను కమిటీ సిద్ధం చేస్తుంది. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది" అని పవన్ పేర్కొన్నారు. ఇప్పటికే వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించామని పవన్ తెలిపారు. మరణించిన 18 మంది మత్స్యకారులకి సంబంధించి వారి కుటుంబాలకు చెల్లించాల్సిన బీమా మొత్తం చెల్లింపు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ దగ్గర దెబ్బతిన్న పడవలకు నష్ట పరిహారం చెల్లింపు అంశాలపై అధికారులతో చర్చించానని.. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించానని పేర్కొన్నారు. మచిలీపట్నం, అంతర్వేది తదితర ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వడంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కష్ట జీవులకు భరోసా కల్పిస్తుందన్నారు. ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి.. వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని పవన్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత స్వయంగా ఉప్పాడ మత్స్యకారులతో కూర్చొని అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తానని ఆయన తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన మత్స్యకారుల ధర్నా

పిఠాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉప్పాడలో మత్స్యకార కుటుంబాలు చేపట్టిన నిరసనలు రెండోరోజు కూడా కొనసాగాయి. ఉదయం 6 గంటల నుంచి కూడలి సమీప ప్రాంత రహదారులన్నీ మూసివేసి మత్స్యకారులు ధర్నా చేపట్టారు. కోనపాపపేట, మూలపేట, అమీనాబాద్ మత్స్యకార గ్రామాల్లో రహదారులు మూసివేశారు. దుకాణాలు తెరవద్దని యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మత్స్యకారుల వద్దకు జిల్లా కలెక్టర్ షాన్మోహన్ వెళ్లి చర్చించారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరపున ఆయన హామీ ఇచ్చారు.

అమరావతిలో వైకాపా కుట్రలతో జరిగిన విధ్వంసాన్ని సరిచేస్తున్నాం: మంత్రి నారాయణ

అమరావతి, సెప్టెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శాసనభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతిలో సీఆర్డీఏ నుంచి 21 పనులు, ఏడీసీ నుంచి 64 పనులు జరుగుతున్నట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం రాజధానిని నిర్వీర్యం చేసి మూడు ముక్కలాట ఆడిందని.. దీంతో అమరావతిలో అడవిలా పెరిగిన చెట్లను తొలగించేందుకు రూ.30 కోట్లు ఖర్చు పెట్టాల్సి వచ్చిందన్నారు. రాజధానిలో ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జీల బంగ్లాలు, అధికారులు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. మార్చి 31 నాటికి 3,500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. 2019కి ముందు పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్ల విషయంలో తేడా ఎందుకు చూపుతోందని అడిగారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపును పరిశీలిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. "అమరావతిలో వైకాపా కుట్రల వల్ల జరిగిన విధ్వంసాన్ని సరిచేస్తున్నాం. గతంలో పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లు ఇప్పుడు ముందుకు రాలేదు. మళ్లీ టెండర్లు పిలవాల్సి వచ్చింది. హడ్కో, ప్రపంచ బ్యాంకు ద్వారా రాజధాని నిర్మాణానికి రుణాలు తీసుకున్నాం. పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయి. పనులు పూర్తయ్యాక ప్రధానిని పిలిచి ప్రారంభోత్సవం చేస్తాం. ఆమదాలవలసలో అమృత్-2లో భాగంగా అక్రమాలు జరిగింది నిజమే. కట్ట నిర్మాణ పనులతో పాటు మరికొన్నింటి విషయంలో నిధుల దుర్వినియోగం జరిగింది. కమిటీ నివేదిక వచ్చింది.. దాని ప్రకారం చర్యలు తీసుకుంటాం." అని నారాయణ తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై నవరాత్రి శోభ.. అన్నపూర్ణా దేవిగా దుర్గమ్మ

విజయవాడ, సెప్టెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడోరోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.

సామాజిక తెలంగాణ కోసం కలిసి పని చేద్దాం: కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర సాధన కోసం అందరం కలిసి పనిచేసి విజయం సాధించామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తదుపరి లక్ష్యం సామాజిక తెలంగాణ కోసం పని చేద్దామని ఆమె పిలుపునిచ్చారు.

"ఆత్మ గౌరవంతో కూడిన తెలంగాణ కోసం పనిచేద్దాం. పునరేకీకరణ కోసం కలిసి పోరాటం చేయాలి. రాష్ట్రంలో పేదల వైపు ఉండి పోరాడుతాం. సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన వారిని ఆహ్వానిస్తున్నా. జాగృతిలో ఇప్పటికే ఉన్న నాయకత్వంతో పాటు.. చేరుతున్న కొత్త వారికి సముచిత స్థానం కల్పిస్తాం. కుత్బుల్లాపూర్లో హైడ్రా బాధితులైన పేదల పక్షాన పోరాటం చేస్తాం. భవిష్యత్తులోనూ పేద ప్రజల కోసం పోరాటాలు కొనసాగిస్తాం" అని కవిత తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'ఓజీ' మూవీ టికెట్స్ ధరల పెంపును సస్పెండ్ చేసిన హైకోర్టు

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో రూపొందిన గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామా 'ఓజీ'. సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం రాత్రి నుంచి ప్రీమియర్లు ప్రదర్శించడంతో పాటు, టికెట్ ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తెలంగాణ హైకోర్టు బుధవారం సస్పెండ్ చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎన్వీ శ్రవణ్కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 'ఓజీ' విడుదల నేపథ్యంలో టికెట్ ధరలను పెంచాలని కోరుతూ చిత్ర నిర్మాణ సంస్థ ప్రభుత్వాన్ని కోరగా, అందుకు అనుమతిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మెమోను సవాల్ చేస్తూ మహేశ్ యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టికెట్ల పెంపునకు అనుమతి ఇవ్వడానికి హోంశాఖ స్పెషల్ సీఎస్కు ఎలాంటి అధికారాలు లేవని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని పోలీస్ కమిషనర్, జిల్లాల పరిధిలో జాయింట్ కలెక్టర్ కు మాత్రమే మెమో జారీ చేసే అధికారం ఉందన్నారు. టికెట్లు అధిక ధరకు విక్రయించకూడదని నిబంధనలు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 'గేమ్ ఛేంజర్' సందర్భంగా హోంశాఖ అండర్ టేకింగ్ కూడా ఇచ్చిందన్న అంశాన్ని పిటిషనర్ తరపు న్యాయవాది వివరించారు. ఈ వాదనలను పరిగణనలో తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ జారీచేసిన మెమోను సస్పెండ్ చేశారు. తదుపరి విచారణ వచ్చే నెల 9వ తేదీకి వాయిదా వేశారు. తెలంగాణలో టికెట్ ధరల పెంపు సహా ముందురోజు అంటే సెప్టెంబరు 24న రాత్రి 10గంటలకు ప్రీమియర్లు ప్రదర్శించేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీనికి టికెట్ ధర జీఎస్టీతో కలిపి రూ.800. అలాగే సినిమా విడుదల రోజు (ఈ నెల 25) నుంచి అక్టోబరు 4 వరకు సింగిల్ స్క్రీన్స్ పై రూ.100 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్ ల్లో రూ.150 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది.

రిపబ్లిక్ స్పోర్ట్స్

ఆసియా గేమ్స్.. భారత ఫుట్బాల్ జట్టు డౌటేనా?

ప్రతిష్ఠాత్మక ఆసియా గేమ్స్ 2026 సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్నాయి. ఈ క్రీడా పండుగకు జపాన్లోని నగోయా వేదిక కానుంది. అయితే.. క్రీడల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన నూతన నిబంధనలతో భారత ఫుట్బాల్ జట్టు పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. ఆసియా ఖండంలో వ్యక్తిగత విభాగంలో టాప్-6, టీమ్ ఈవెంట్లో టాప్- 8లో ఉంటేనే ఆసియా గేమ్స్కు నామినేట్ చేస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే భారత ఫుట్ బాల్ జట్టు ప్రస్తుతం ఆసియాలో 24వ స్థానంలో ఉంది. పతకాలు గెలుచుకునేందుకు నిజంగా అవకాశం ఉన్న అథ్లెట్లు మాత్రమే పోటీలో ఉండాలనే ఉద్దేశంతో క్రీడా మంత్రిత్వ శాఖ ఈ నిబంధనలు అమల్లోకి తెచ్చినట్లు ప్రకటించింది. దీంతో మన ఫుట్బాల్ జట్టు ఈ గేమ్స్ పాల్గొనే అంశం సందిగ్ధంలో పడింది. భారత ఫుట్బాల్ జట్టు 1951, 1962లో జరిగిన ఆసియా క్రీడల్లో రెండు బంగారు పతకాలు, 1970లో కాంస్య పతకం గెలుచుకుంది. భారత జట్టుకు ఈ విభాగంలో అదే చివరి పతకం కావడం గమనార్హం. 1998లో తమ రౌండ్ 2 మ్యాచ్లో ఓడిపోయింది. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన ఎంపిక ప్రమాణాలు కేవలం ఆసియా గేమ్స్కు కాకుండా, కామన్వెల్త్ క్రీడలు, పారా ఆసియా గేమ్స్, ఆసియా ఇండోర్ గేమ్స్, ఆసియా బీచ్ గేమ్స్, యూత్ ఒలింపిక్స్కు కూడా వర్తించనున్నాయి.

ఇంటి చిట్కాలు

ఎండలు పెరగడంతో మైగ్రేన్ తలనొప్పి మొదలైందా, బాధపడకుండా కొన్ని పదార్థాల వాసనని చూడండి సమస్య మీ దరికి రాదు

మైగ్రేన్.. తలకి ఒకేవైపుకి వచ్చే ఈ నొప్పితో చాలా మంది ఇబ్బంది పడతారు. దీనినే పార్శ్వపు అని కూడా అంటారు. దీనిని తగ్గించేందుకు కొన్ని ఇంటి చిట్కాల గురించి తెలుసుకోండి.

తలనొప్పి వచ్చిందంటే ఓ చోట మనసు కుదుటగా ఉండదు. ఇక మైగ్రేన్ తలనొప్పి అంటే బాబోయ్ చాలా కష్టం. ఇది ఎండకాలం వస్తోంది కాబట్టి మరింత పెరిగే అవకాశం ఉంది. దీనికి కారణాలు చాలానే ఉంటాయి. అందులో ముఖ్యంగా నిద్రలేకపోవడం, టైమ్కి తినకపోవడం, ఎక్కువగా కెఫిన్ తీసుకోవడం, వర్కౌట్ చేయకపోవడం, ఒత్తిడి, పీరియడ్స్ ఇలా చాలానే కారణాలు ఉంటాయి. వీటన్నింటిని సరిచేసినప్పటికీ నొప్పి ఇంకా ఉందంటే కొన్ని ఇంటి చిట్కాలు పాటించొచ్చు. వీటి వల్ల కూడా చాలా వరకూ తలనొప్పి తగ్గుతుంది. పైగా ఇవన్నీ కూడా ఇంట్లో మనకి రెగ్యులర్గా దొరికే ఆహార పదార్థాలే. అవేంటో ఇప్పుడు చూద్దాం.

లావెండర్ ఆయిల్

లావెండర్ ఆయిల్తో ఎన్నో లాభాలు ఉంటాయి. వాసన చూడడం వల్ల కూడా మైగ్రేన్ పెయిన్ తగ్గిస్తుంది. దీనిని డైరెక్ట్గా వాసన చూడొచ్చు. లేదా ఏదైనా క్యారియర్ ఆయిల్లో కలిపి తల వెనుక భాగంలో రాయొచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం మనం 3 నెలల పాటు లావెండర్ థెరపీని ట్రై చేయడం వల్ల మైగ్రేన్ అలాక్ తగ్గిందని చెబుతున్నారు.

పెప్పర్మెంట్ ఆయిల్

పెప్పర్మెంట్ ఆయిల్లో కొన్ని గుణాలు మైగ్రేన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది పెప్పర్మెంట్ ఆకుల వాసన చూసినా సమస్య తగ్గినట్లుగా అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ వాసన చూడడం వల్ల చాలా వరకూ రిలాక్స్గా ఫీల్ అవుతున్నారని దీనికోసం రెగ్యులర్గా పెప్పర్మెంట్ వాసన చూడడం మంచిదని చెబుతున్నారు.

అల్లం



మైగ్రేన్ సహా వికారం, వాంతుల వంటి సమస్యల్ని తగ్గించడంలో అల్లం బాగా పనిచేస్తుంది. అల్లాన్ని మనం చిన్న ముక్కలుగా కట్ చేసి నోటిలో వేసుకుని రసం పీల్చడం లేదా దీనిని మనం టీలా చేసుకుని తాగడం వల్ల సమస్య తగ్గుతుందని చెబుతున్నారు.

మిరియాలు

మిరియాలు వంటకి రుచిని అందించడమే కాదు. తలనొప్పిని కూడా ఆటోమేటిగ్గా తగ్గిస్తాయి. దీనికోసం మనం మిరియాలని ఎలా అయినా తీసుకోవచ్చు. వంటల్లో వాడడం, రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడంలం వంటివి చేయడం వల్ల సమస్య చాలా వరకూ తగ్గుతుంది. నల్ల మిరియాల్లో ఎక్కువగా యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నేచురల్ పెయిన్ కిల్లర్స్లా పనిచేస్తాయి. ఈ మిరియాల్లోని విటమిన్స్, మినరల్స్ తలనొప్పి చాలా వరకూ తగ్గుతాయి.

మసాజ్



మనం మైగ్రేన్ ఉన్నప్పుడు రెగ్యులర్గా తలని మసాజ్ చేయడం వల్ల సమస్య తగ్గుతుంది. మైగ్రేన్ రిలీఫ్ కోసం ఏదైనా ఓ నూనెని తీసుకుని తలకి తెలవెనుక భాగంలో నిదానంగా మసాజ్ చేయండి. రెగ్యులర్గా ఇలా చేస్తే తలనొప్పి ఆటోమేటిగ్గా తగ్గుతుంది.